

పోతరాజు వెలిగిపోతున్నాడు. అల్ల సూరీడు తూరుపుదిక్కు కొండమీద పలకర్ర తోమినపుడు ఎర్రగా ఎలుగుతాడు కదా, అలా ఎలిగిపోతున్నాడు. అతగాడెందు కలా ఎలిగిపోతున్నాడూ అంటే చాన్నాళ్ళకిందికి పోవాలి.

ఈ పోతరాజు అసలేటీ లేనోడు. చిన్నప్పుడు బళ్ళో వేస్తే ఒకటో కలాసు వాడు పాసైపోనాడు. రెండో కలాసు మాస్టార్లు పాసు చేసేసారు. మూడో కలాసుకు వాడూ మాస్టర్లూ జాయింటుగా కుస్తీ పట్టారు కాని కుదర లేదు. మళ్లీ ప్రయత్నం చేస్తే మాస్టరు పాసైపోయాడు కాని ఇతగాడు ఢింకీ కొట్టేసాడు. అక్కడే తొంగుండిపోయాడు. వీడి బాబు పొలం పనులకు ఎల్లి రూపాయి రూపాయి కూడబెట్టి ఈడిని పెద్ద చదువులు చదివించేసి పెద్ద కలకటర్నో, డాకటరునో చేసేద్దామనుకున్నాడు. కానీ ఈడో ఎదవ. ఆడి బాబుకున్న ఆశల్ని మొగ్గలోనే తుంచేసినాడు.

# దేశం తూలుతోంది

డాక్టర్. బి. ఎస్. ఎన్. మూర్తి

చదువు అబ్బలేదు. ఏటి సెయ్యాలా అని ఆలోచిస్తూండగా ఒక వోటేలు కాడ ప్లేటులో కడగడానికి ఆపరు వచ్చింది. మరో బాబు తన గేదెల మందని చూసుకోమని ఆపరు ఇచ్చాడు. మరో సావుకారు దుకాణంలో సామాన్లు పొట్లాలు కట్టే ఉద్యోగమిస్తానన్నాడు. ఎవరు సెప్పారు దేశంలో నిరుజ్జోగం పెబలిపోతోందని, ఇన్ని ఉద్యోగాలు పెపంచకంలో చదువు రానివాడికోసం ఉండగా ఇంకా చదివి చేసేదేముంది? అన్న ఆలోచనలో పడ్డాడు. చివరకు బతుకుని ప్లేటులు కడిగే ఉద్యోగంతో మొదలెట్టేసాడు.

ఆ హోటల్లోకి చాలా రకాల జనాలు వచ్చేవారు. గజదొంగలొచ్చేవారు. ఘరానా మనుషులొచ్చేవారు. చిల్లర నోటు లేసుకొని కుర్రాళ్లు వచ్చేవారు. రకరకాల మాటలు మాట్లాడేవారు. పోలిటిక్సు మాట్లాడేవోరు. వాతావరణం గురించి మాట్లాడేవారు. షేరులూ, డబ్బూ మాట్లాడేవారు. అదిగో అలా మాటాడేవారినందరినీ పట్టిపట్టి చూసేవాడు పోతరాజు. వాడికి అర్థమైపోయింది – పెపంచకం డబ్బు చుట్టూ తిరిగిపోతున్నదని, ఈ దేశంలో ముష్టోళ్లు ఎక్కువ. ఎంగిలాకులు నాక్కునే వీది కుక్కలు కూడా ఎక్కువే. ముష్టోళ్ళ నుంచి గొప్పోళ్ళ వరకూ, వీది కుక్కల నుంచి అడవి సింహాల వరకూ అందరూ డబ్బుకోసమే బతుకుతున్నారని, డబ్బుకోసం ఎలాటి అగాయిత్యాలయినా చేస్తారని, ఎన్ని అబద్దాలయినా ఆడతారని అరదమైపోయింది. ఎలా సంపాదిస్తున్నావన్నది కాదు పాయింటు, ఎంత సంపాదిస్తున్నావన్నదే జీవిత పరమార్దం అని అర్దమైపోయింది.

పోతరాజు పనిచేసే హొటేలుకే ఒకామె రోజూ పప్పు రుబ్బేందుకు వచ్చేది. ఆమె వాడికంటే పెద్ద వయసే. ఆమెతో పరిచయమయింది. ఆవిడ చాలా రకాల వ్యాపారాలు చేసిందట. కొన్నాళ్ళు పనిలోకి ఆడకూలీలను బెత్తాయించే 'మేస్త్రమ్మ'గా చేసిందట. కొన్నాళ్లు చెగోడీలు, జంతికలు అమ్మేదట. అప్పుడప్పుడు దొంగచాటుగా సారా కవర్లు అమ్ముతుందట. ఆవిడ అసలు పేరేమిటో చాలామందికి తెలీదు. ఆవిడ పెళ్లయిన కొత్తలో మొదట తప్పతాగి ఇంటికొచ్చి ఆవిడమీద చెయ్యి చేసుకుంటే వాడికి కాళ్లిరిచీసినంత పని చేసి రాత్రంతా చెట్టుకు కట్టేసిందట. దాంతో ఆవిడకు భయపడి మొగుడు ఆవిడను వదిలేసి పారిపొయ్యాడంటారు. అప్పటి నుంచి ఊర్లో ఆడాళ్లందరూ ఆవిడను 'డేరింగక్క' అని పిలవసాగారు. ఆ పేరే ఆవిడకు మిగిలిపోయింది.

హొటేలుకొచ్చేవాళ్లలో ఒక కుర్ర జట్టు పోతరాజుని బాగా ఆకట్టుకుంది. వాళ్లు టేబులు చుట్టూ కూర్చోడం, పరసులో డబ్బులు తీసి పంచుకోవడమూ చూస్తే వాడికి ముచ్చటేసింది. ఈళ్లింత సరదాగా బతికేస్తున్నారేమిటా అని ఆరా తీశాడు. చివరకు తెలిసింది - వాళ్లు జేబుదొంగతనాలు చేసే జట్టని. వాళ్లతో ఆమాటా ఈమాటా మాటాడేక వాళ్ల మనసులతో ఈడి మనసు కలిసిపోయింది, మరేం హొటేల్లో ఉద్యోగం వదిలేసాడు.

కొత్తలో వాడికి బస్సులు, రైళ్లూ ఎక్కేవాళ్ల దగ్గర జేబులు కొట్టడం మహా సరదాగా వుండేది. ఒక్కోసారి పోలీసులకు చిక్కిపొయ్యేవాడు. కొందరు పోలీసులు స్టేషనుకు అప్పగించేసి కేసు కట్టేసేవారు. ఒక్కోసారి పరసులో డబ్బులు లెక్కపెట్టుకొనేలోగానే పోలీసోళ్లు ముందరే లెక్క చెప్పేసి దరమంగా సగం వాటా అడిగి తీసుకునేవారు.

పోతరాజు జేబు దొంగల్లో పెద్దవాడయిపోయాడు. వాటి ఫోటో రైల్వే స్టేషనులోనూ, బస్టాండులోనూ మిగతా దొంగలతో కలిపి వాల్‌పోస్టర్ల మీదికి ఎక్కింది. కిందన 'జేబుదొంగలున్నారు జాగ్రత్త' అని రాయబడింది. ఆ పోస్టర్ల వంక చూసి 'నా పాపులారిటీ ఇంత పెరిగిపోనాదేమిటీ' అని చాలా సరదాపడిపోయాడు.

డేరింగక్క హొటేల్లో ఉద్యోగం మానేసింది. పోతరాజు ఆసరాతో దొంగసారా వ్యాపారం మళ్ళీ మొదలుపెట్టింది. దూరాన్నెక్కడో కొండల మధ్య పల్లెటూర్లోనో వండిన సారాని పోతరాజు భుజానికెత్తుకొని వచ్చేసేవాడు. వాడు వయసులో వున్నాడు. క్వింటాలు బరువైనా తలకెత్తుకొని పిక్క వణక్కుండా నడిచీగలడు. రాతిరిపూట సీక్రెట్టుగా ఇంట్లోనే కూర్చుని అమ్మేసేది డేరింగక్క. ఇలా ఆవిడకు జరుగుబాటు బాగానే వుండేది. పోతరాజు కూడా నాలుగు డబ్బులు కళ్లచూడసాగాడు. డబ్బులు సమకూరాక మంచి ఫారిన్ విస్కీ బాటిలు కొనుక్కుని వళ్లు మరచిపోయి తాగేసి రెండు రోజులు మాటామంతీ లేకుండా పడకేసేవాడు. లేచాక మళ్లీ అదే వ్యాపారం మొదలు. ఇదంతా మద్యపాన నిషేధం అంటూ చట్టమేమీ అమలులేని కాలంలో.


సరిగ్గా అలాంటి సమయాన్నే ఎలక్షన్లొచ్చాయి. ప్రభుత్వం కోసం పోటీ చేస్తున్న కొత్త పార్టీ రామరాజ్యంకోసం నడుంకట్టింది. దేశంలో జనాలు తాగేసి చెడిపోతున్నారని, కుటుంబాలు కూలిపోతున్నాయని ప్రచారం చేసింది. సారాకొట్లూ, విస్కీ షాపులూ వుండకూడదంది. ఆయనెవరో ఒక పెద్దాయన ముందెప్పుడో ఇంగ్లీషు వాళ్లతో పోట్లాడి స్వరాజ్యం తెచ్చిన వాళ్లలో వున్నారట. ఆయన గాంధీ గారికి వారసుడట. దేశంలో 'మద్యపాన నిషేధం' పెట్టాలి. అప్పుడే రామరాజ్యం వస్తుందని చెప్పారు. ప్రజలు ఊరికే కూర్చోలేరు కదా. ఏదో ఒకటి కాలక్షేపం అయిపోవాలి. అందరూ ఆ పెద్దాయన దారినే నడిచారు. సారాబట్టీల మీద, విస్కీ షాపుల మీద రెయిడింగ్ చేశారు. ఈ ప్రజల మద్దతుతో ఎన్నికల్లో కొత్త పార్టీ గెలిచింది. కొత్త ప్రభుత్వం వచ్చింది. అది రాగానే మద్యపాన నిషేధం శాసనం అమలుపరిచేసింది. అన్ని ఊర్లలోనూ అధికారికంగా వున్న సారా కొట్టులూ, విస్కీ షాపులూ మూసుకుపోయాయి. దొంగతనంగా తెచ్చుకు తాగిన వాడిని జైల్లో పెట్టేస్తామంటూ పోలీసువాళ్లు వార్నింగులు ఇచ్చారు. 'ఇదిగో రామరాజ్యం' అంది ప్రభుత్వం. ప్రజలకు తాము చేసిన తప్పేమిటో తెలిసిపోయింది. 'సేతిలో రొట్టె పారేసుకుని అగ్గట్టుకొన్నాంరా' అని విలపించారు. 'ఈ రాజ్జెంలో కడుపునిండా కూడు లేకపాయె. వంటి నిండా బట్ట లేకపాయె. పరవానేదు. అవేటీ అడగనేదు. కానీ కష్టపడేవోళ్లం. ఒకింత సారా సుక్క ఏసుకుంటేగాని కంటిమీద రెప్ప ఎలా మూసుకుంటాదీ' అని కూలీనాలీ ఆక్రందన. మధ్యతరగతి వాళ్లు పిల్లల చదువులకో, కూతుళ్ల పెళ్లిళ్లకో అప్పులపాలయి ఆ బాద మరచిపోడానికంటూ తాగేవారు. మద్యపాన నిషేధం పెట్టగానే ఇలా మందు మనిషికి ఎంత అవసరమో చాలామందికి అర్థమయింది. డబ్బున్నవాళ్ళు సరదాకో, అలవాటుకో మందు సేవిద్దామంటే, వాళ్లకుండే మార్గాలు వాళ్లకున్నాయి. కాని మిగతావాళ్లు పులికోరల్లో మేకపిల్లలాగా ఇరుక్కుపోయారు. ఎక్సయిజు వాళ్ల రెయిడింగులు తట్టుకోలేక దొంగసారా వండిన వాళ్లు కూడా వ్యాపారం మానేశారు.

ఊళ్లో ఇటు పోలీసోళ్లూ, అటు ఎక్సయిజువాళ్లూ బిజీ అయిపోయారు. ఆ ఊరికి సరిగ్గా పాతిక కిలోమీటర్ల దూరం నుంచి ఒరిస్సా బోర్డరు స్టార్టవుతుంది. ఒరిస్సాలో మద్యనిషేధం లేదు. అక్కడ తాగొచ్చు. ఆంధ్రావాళ్లు వెళ్లి అక్కడ పడ్డారు. ఇది చూసి ఎక్సయిజు వాళ్లు మండిపడ్డారు. ఆ రాష్ట్రం నుంచి పాసింజర్లతో వచ్చే బస్సులను చెక్‌పోస్టు దగ్గర ఆపసాగారు. అందులో పాసింజర్ల మొహాలను వాసన చూసి తాగినోడిని పట్టేసి కిందకు దించేసేవారు. వాడో పది రూపాయల నోటు చేతిలో పడితే సరి. లేకపోతే గుంజీలు తీయించేవారు.

పోతరాజుకు సరకు కోసం ఒరిస్సా వెళ్లక తప్పలేదు. అక్కడినుంచి సరకుని బస్తాలోకెత్తుకొని రాత్రిపూట కొండవాలుగుండా చీకట్లో నడిచి బోర్డరు దాటి ఆంధ్రాలోకి చేరుకునేవాడు. అక్కడినుంచి డేరింగక్క ఇంటికి. డిమాండు ఎక్కువగా వుండడంతో చాలా లాభాలు రాసాగాయి.

ఒకసారి పోతరాజు జేబులో డబ్బేసుకొని ఒరిస్సా వెళ్లి తాగి ఆంధ్రాకు తిరిగొచ్చాడు. చెక్‌పోస్టు దగ్గర ఎక్సయిజువాళ్లు బస్సు ఆపేసి తనిఖీలు మొదలెట్టారు. మొగాళ్లనందరినీ ఊపిరి బయటకు వదలమని వాసన చూడసాగారు. పోతరాజు దొరికిపొయ్యేడు. దొరికిపొయ్యాక వాదించాడు. ''నేను తాగింది ఒరిస్సాలో. ఆంధ్రాలో కాదు. ఇందులో తప్పేటీ?'' ఎక్సయిజు వాళ్లు తప్పేమిటో చెప్పారు. ''ఒరిస్సాలో తాగినా కంపు ఆంధ్రాకు కొడతాంది. ఎక్కడి కంపు అక్కడే వుండాల'' అంటూ, గుంజీలు తీయించారు.

మద్యనిషేధం సరిగ్గా అమలు జరగడానికి ప్రభుత్వం ఒరిస్సా బోర్డరు దిగువన కొత్తగా మరో చెక్‌పోస్టు పెట్టింది. అక్కడ డ్యూటీ చేస్తున్న వాళ్లలో



అప్పలస్వామి అని కానిస్టేబులు వున్నాడు. అతడు వట్టి రూల్సు మనిషి. కాని మంచోడు. ఆంధ్రావాడైనా ఒరిస్సాలో తాగితే అతడికి ఫర్వాలేదు. ఎంత కంపయినా భరించేస్తాడు. ఒకసారి పోతరాజు చెక్‌పోస్టు అవతల బాగా తాగొచ్చి అప్పలస్వామిని అడిగాడు – ''నా డ్యూటీ ఆంధ్రాలో. రోడ్డు సూత్తే ఒరిస్సా నుంచి ఆంధ్రాలోకి పాకురుతుంది. పొరపాటున అటువాళ్లు ఇటు జారివచ్చీవచ్చు. అలా జరక్కుండా జాగరత్తకోసం రోడ్డుకు అడ్డంగా ఒక గీరు గీయరాదా?''

అప్పలస్వామికి ఈ సలహా నచ్చింది. రోడ్డుకు అడ్డంగా సుద్దముక్కతో గీత గీశాడు. ''అవతల ఒరిస్సా. ఇటుకేసి ఆంధ్రా. అటు ఎవడైనా తాగొచ్చు. ఇవతల తాగడానికి వీల్లేదు'' అంటూ రూలుపెట్టేశాడు. ఒకసారి పోతరాజు గీతకవతల ఒరిస్సాలో రోడ్డుమీద కూర్చుని తాగేడు. తర్వాత తూలుకుంటూ నడిచొచ్చి ''ఏయ్ అప్పలసామీ నా కాలు ఆంధ్రాలోకి జారిపోతోంది సూడు'' అంటూ కవ్వించేడు.

''అడుగు ఇటు పడ్డాదో కేసెట్టేస్తాను'' అప్పలసామి వార్నింగు ఇచ్చేడు.

పోతరాజు అడిగేడు – ''నేను తాగేసి గీతమీద సగం ఇటు, సగం అటు పడిపోనాననుకో, అప్పుడేటి సేత్తావు?''

''అలా పడిపోతే గీతకిటేపు బాడీ కోసేసి దానిమీద కేసెడతాను'' అన్నాడు అప్పలసామి.

మందు మత్తు దిగాక బస్సెక్కి తిరిగొచ్చేడు అతడు.

కొద్దిరోజుల్లోనే ఇంకా పెద్ద వ్యాపారం గురించి ఆలోచించసాగాడు. లారీలో క్లీనరులాగా వెళ్లి విస్కీ సీసాలు లోడు మధ్యలోనో, సీటుకిందో, స్టెఫిన్ టైరు ట్యూబులోనో అమర్చి తెచ్చేవాడు. ఆంధ్రాలో డబుల్ రేటుకు అమ్మేవాడు. డేరింగక్క సాయం ఇందులో చాలా వుండేది. పోతరాజు ఈ వ్యాపారంలో క్రమంగా చాలా సంపాదించాడు. అలాగలాగ ఇంకా గొప్పవాడవసాగాడు.

ఆంధ్రా బోర్డరుకు దిగువనే 'కొట్టక్కి' అనే ఓ పల్లెటూరు వుంది. ఆ ఊళ్ళో ఏటా అమ్మోరి పండగ ఘనంగా జరుగుతుంది. ఆయేడు పండగ దగ్గరపడింది. జనాలు రచ్చబండ దగ్గర మీటింగు పెట్టుకున్నారు. ''ఏటీ? సారా మందూ లేకుండా పండగ ఎలా అవుద్దీ? బళ్ల వేసగాళ్లు వేసాలతో రాతిరంతా ఉండాల. ఆళ్లకి గొంతులో సుక్క పడకపోతే ఆళ్లు పడిపోతారు. పులేసగాళ్లు మందు లేకపోతే డాన్సు సెయ్యలేరు. పండక్కి సుట్టాలు, పక్కాలు, సుట్టుపక్కల విలేజోళ్లు అందరూ వస్తారు. ఆళ్లందరికీ గొంతు తడుపుకొందుకు లేకపోతే అమ్మోరు కోపగిస్తుంది. అమ్మోరు శాంతించాలన్నా, ఊరి పరువు నిలబడాలన్నా ఊళ్లోకి సారా పేకెట్టులు దండిగా రావాలసిందే'' అన్నారందరూ. వాళ్లలో ఒక ఆసామి అన్నాడు. ''ఇలాటీటికి పోతరాజే ఏటైనా యుపాయం సెబుతాడు''.

> ''ఈ మద్దెనిషేదం పెట్టడం వల్ల పెబుత్వ ఆదాయం పడిపోనాది. ఆదాయం లేక పాజెక్టులు కట్టనేదు. పాక్టరీలు ఎట్టనేదు. మనకు కరెంటు సార్జీలు, ఇంటిమీద పన్నులు పెరిగిపోనాయి. మా పారిటీకి పవరు వస్తే ఈ మద్యనిషేధం ఎత్తేస్తాం. అప్పుడు ప్రజలకు అన్ని పన్నులూ తగ్గిపోతాయి. కరంటుకు సార్జి వుండదు. బస్సుకు సార్జీ ఉండదు. అన్నీ ప్రీయే''

అందరూ వెళ్లి పోతరాజుని బ్రతిమాలారు. అతడు అందరికీ అభయమిచ్చాడు.

ఈ సమస్య గట్టెక్కడానికి స్వయంగా ఒక పథకం వేశాడు.

చెక్‌పోస్టు దగ్గర చింతపండు లోడుతో ఆంధ్రా వైపు లారీ వచ్చింది. చెకింగుకని సిబ్బంది ఆపారు. కేబిన్లో డ్రయివరు పక్క సీటునుంచి అయిదారుగురు పేసింజర్లు దిగారు. అందరి నోళ్లలోనూ వాసన, వారి జేబుల్లో సగం ఖాళీచేసిన క్వార్టరు బాటిల్సు కనిపిస్తున్నాయి. డ్రయివరు స్వయంగా వాళ్లను సిబ్బందికి అప్పజెప్పాడు. కేబిన్లో దూరి గొడవ చేస్తున్నారంటూ పిర్యాదు చేశాడు. చెక్‌పోస్టు సిబ్బంది వాళ్లమీద కేసు పెడతామనడం, వాళ్ళు బ్రతిమాలుకోవడం ఇదంతా గొడవగా మారింది. ఈ గొడవలో వాళ్లు లారీ చెకింగ్ మర్చిపోయారు. డ్రయివరును బండి తీసుకొని వెళ్లిపొమన్నారు. ఆ లారీ బోర్డరు దాటేసింది. కొట్టక్కి విలేజిలోకి వచ్చేసింది. పైవరసలోని చింతపండు గంపలు దింపారు. క్రిందనంతా సారా పేకెట్ల బస్తాలు, విస్కీబుడ్ల పేకెట్టులు.

ఆ వూర్లో అమ్మోరి పండగ ఘనంగా జరిగిపోయింది. అందరూ పోతరాజుని పొగిడారు. ఒక్కొక్కరూ వాడికి దొరికే పున్నెంలో సగం పున్నెం పోతరాజుకే ధారపోసేశాడు. మొత్తానికి పోతరాజు ఊరికి హీరో అయిపోయాడు. ఎవడికైనా ఆపద వస్తే వాడే రక్షించాలి. తగవులొస్తే వాడే తీర్చాలి. వాడి పలుకుబడి పెరిగిపోయింది.

ఎక్సయిజువాళ్లు కూడా అతడికి గౌరవం ఇవ్వసాగారు. ఆ వొడుపు చూసుకొని వాళ్లతో ఒప్పందం పెట్టుకున్నాడు. వాళ్ల కమిషను వాళ్లకిచ్చేసి సరుకు తెచ్చీసుకునేవాడు. చుట్టుపక్కల వూళ్ళలో డబుల్‌రేట్లకు అమ్మేవాడు. డబ్బు, పలుకుబడీ ఇంకా పెరిగిపోయాయి. తనక్రింద మరో పదిమంది ఏజెంట్లను పెట్టుకుని మరీ వ్యాపారాన్ని సాగించాడు. చెక్‌పోస్టు సిబ్బంది ఆంధ్రాలోకి వచ్చే విస్కీ బాటిల్సు అడ్డుకోవడం తమవల్ల కాదని చేతులెత్తేశారు. వాళ్లకు కావలసింది వాళ్ల కమిషను. అంతే.

పోతరాజు పెళ్లీడులో వున్నాడని ఊళ్లో చాలామంది పెద్దలు గ్రహించారు. చాలామంది తమ కూతుళ్లను 'ఆఫరు' చేసారు. కాని ఊర్లో పెద్దినాయుడు దగ్గర బాగా డబ్బుందని అర్థం చేసుకున్న పోతరాజు అతడి కూతురినే ఎంచుకున్నాడు. వాడికో పెళ్లామూ, ఇల్లూ, ఇనబ్బీరువాలూ, బాంకు ఎకౌంటులూ, ఆక్టావియా కారూ, రెండు ఆల్షేషియన్ కుక్కలూ, పదెకరాల మాగాణీ అన్నీ సమకూరాయి. ఒక్క మాటలో చెప్పాలంటే చాలా గొప్పవాడైపోయాడు. తర్వాత ఎలక్షన్లో అపోజిషను పార్టీ అభ్యర్థిగా అతడినే వుండాలన్నారు. దానికి సమ్మతించాడు పోతరాజు.

ఎలక్షన్లు వచ్చాయి. మీటింగులు వేడిగా సాగాయి. అపోజిషను పార్టీ అభ్యర్థి పోతరాజు. ఆ పార్టీవాళ్లు పబ్లిక్కు మీటింగులో అరచేతిలో స్వర్గం చూపించారు. ''ఈ మద్దెనిషేదం పెట్టడం వల్ల పెబుత్వ ఆదాయం పడిపోనాది. ఆదాయం లేక పాజెక్టులు కట్టనేదు. పాక్టరీలు ఎట్టనేదు. మనకు కరెంటు సార్జీలు, ఇంటిమీద పన్నులు పెరిగిపోనాయి. మా పారిటీకి పవరు వస్తే ఈ మద్యనిషేధం ఎత్తేస్తాం. అప్పుడు ప్రజలకు అన్ని పన్నులూ తగ్గిపోతాయి. కరంటుకు సార్జి వుండదు. బస్సుకు సార్జీ ఉండదు. అన్నీ ప్రీయే'' అంటూ మైకుల్లో ఉపన్యాసాలు దంచీసారు.

అధికార పార్టీ వాళ్లకు తాము చేసిన తప్పు అర్థమయింది. ''మేము మద్దెనిషేదం ఎత్తేస్తాం. కావాలంటే సాచ్చీకం చూడండి'' అంటూ కవర్లతో సారాని రప్పించి ప్రజలకు పంచేసారు.

ఎలక్షన్లు అయిపోయాయి. అపోజిషను పార్టీ నెగ్గింది. పోతరాజూ నెగ్గాడు. ప్రభుత్వం మారిపోయింది.

కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యనిషేధాన్ని రద్దుచేసింది. అన్ని ఊర్లలోనూ మందుషాపులకూ, బార్లకూ ఎడాపెడా లైసెన్సులిచ్చేసింది. ప్రజల్ని సుబ్బరంగా తాగి సుకంగా బతకమంది.

పనిలో పనిగా కొన్ని ఊళ్లలో కొందరు పెద్దోళ్లు సిండికేట్లుగా మారి ఒక్కొక్క ఏరియాలో మందుషాపుల్ని గుత్తకు పాడేసుకున్నారు. అలాంటి సిండికేట్ల ముఠాలో పోతరాజు చేరిపోయాడు. మూడు సీసాలూ, ఆరు గలాసులుగా ఉందా వ్యాపారం. కావలసినవాళ్లు తాగుతూనే వున్నారు. తాగినోళ్లు తూలుతూనే వున్నారు. సిండికేట్లు లాభాల్లో తేలుతూనే వున్నారు.

కొందరు సిండికేట్లు పోతరాజుకు ఫిర్యాదు చేశారు. ''సెడ్డోళ్లు కొందరు దొంగతనంగా సారా అమ్ముకోవడం వల్ల పెద్దషాపులకు లాబాలు తగ్గిపోతున్నాయనీ, ఆళ్లని ఒకపాలి పట్టి జైల్లో ఏస్తే ఆళ్లకి జ్ఞానోదయం అయి ఆ యాపారం మానేస్తా''రనీ. పోతరాజుకు విషయం అర్థమయింది. ఎక్సయిజు వాళ్లను పురమాయించేడు. అర్థరేతిరి రైడింగులో అనుకోకుండా డేరింగక్క, దానితోబాటు మరో ఇద్దరు ఆడోళ్లు దొరికిపోయారు. పట్టుకొచ్చి స్టేషన్లో వుంచారు.

డేరింగక్క దొరికిపోయిందంటే మొదట ఆశ్చర్యపోయాడు పోతరాజు. అతడికి గుర్తొచ్చింది – మద్యనిషేధం రోజుల్లోనే తనూ, ఆమె కలిసి ఈ వ్యాపారం బాగా చేశారు. ఆమెను అప్పుడే యాపారం మానేయమని చెప్పడం తనకు మర్యాద కాదు. కానీ చెప్పకపోతే లాభాలు పడిపోతాయి. అందుచేత ఈ వ్యాపారం మానేయమని చెప్పి 'కేసు లేకుండా వగ్గీమందాం' అనుకుంటూ స్టేషనుకు బయలుదేరాడు.

పూర్వం చెక్‌పోస్టు దగ్గర డ్యూటీ చేసిన అప్పలసామి ఆరోజు స్టేషన్లో సెంట్రీ డ్యూటీ చేస్తున్నాడు.

పోతరాజు అనబడే ఎమ్మెల్యే గారిని చూసి నమస్కారం పెట్టాడు.

పోతరాజు తిన్నగా డేరింగక్క దగ్గరికి వెళ్లాడు. ఆమె సగంమాసిన పచ్చచీర కట్టుకొని ఉంది. జుత్తు ముడివేసుకొంది. ఆమెతో వెటకారంగా అన్నాడు. ''ఏటి దొంగసారా యాపారం సేత్తూ దొరికిపోనావేటి?'' ఆమె ముఖం ఎర్రబడింది. దొరికిపోయినందుకు కాదు, పోతరాజు ఎగతాళిగా మాట్లాడినందుకు. ''నిన్ను యిడిపించడానికి వచ్చాను. కానీ నువ్వీ యాపారం వగ్గేస్తానని మాటివ్వాలి'' అన్నాడు.

డేరింగక్క మాట్లాడలేదు. గదిలో సైకిలు ట్యూబుల్లోంచి, చిదిగిన కవర్లలోనుంచి వొలికి పులిసిన సారా వాసన కమ్మగా వుంది. పోతరాజు మళ్లీ అన్నాడు. ''సూడక్కా. సెట్టం వుంది. రూల్సున్నాయి. నీతుంది. నేయముంది. ఇలా దొంగసాటుగా సారా యాపారం సేసుకొంటూ పెద్ద మందుల షాపులకు దెబ్బకొట్టేకు''

అతడు చెప్పినమాట విని తలెత్తి చూసింది. పోతరాజు నుదుటిమీద గుండ్రాటి బొట్టు, చీకట్లో రైలింజను బుర్రమీద లైటులాగా. ఈడు చిన్నపాపాలు చేసిన రోజుల్లో సిన్నబొట్టే ఎత్తేవోడు. పెద్దపాపాలు సేసేసరికి పెద్ద బొట్టు ఎట్టేస్తున్నాడు'' అనుకుంది.

అతడితో అంది – ''నీకిప్పుడు రూలుసు కావలసి వచ్చాయా? నీ పెద్ద షాపుల్లో సీసాల్లో అమృతమేసి అమ్ముతున్నావేటి? నేనమ్మిన సారా తాగితే అంత సెడిపోతుందేటీ లోకం!'' ఆమె ఇంకా ఏవో మాటలు చెబుతోంది. పోతరాజుకు చిరాకు మొదలయింది. ''దీన్న ఇడిపించడానికి వస్తే నాకే నీతులు సెబుతూంది. దానికి బుద్ధి రావాలంటే కేసు కట్టేయాలి'' అంటూ సియ్యో వేపు చూసి 'కేసు కట్టేయండి' అన్నాడు. తర్వాత అక్కడినుంచి ఠీవీ, దర్పం ఉట్టిపడేలా అడుగులు వేసుకుంటూ బయటకు వచ్చి కారెక్కాడు. కారు కదిలింది.

కానిస్టేబులు అప్పలసామికి డేరింగక్క మీద జాలి కలిగింది. అతడు సియ్యోతో అన్నాడు – ''బాబూ. డేరింగక్క బతుకుకోసం ఈ యాపారం చేస్తుంది కాని ఆవిడ చాలా మంచిది. దిక్కుమాలినోళ్లని చేరదీసి కడుపునిండా తిండి పెడుతుంది. ఆవిడ మీద కేసు ఎడితే దేవుడు మనను చమించడు'' బ్రతిమాలసాగాడు.

అప్పలసామి మంచితనం సియ్యోకి తెలుసు. అతడు మంచిమాటలే చెబుతాడన్న సంగతి ఇంకా బాగా తెలుసు. డేరింగక్కనూ, ఆమెతోబాటు దొరికిపోయిన మిగతా ఆడాళ్లనూ వదిలేశాడు.

బయటకు వస్తూనే డేరింగక్క అంది – ''సాయం చెయ్యాల్సినోడు చెయ్యలేదు. చెయ్యనక్కరలేనోడు చేసాడు. నా యాపారం వల్ల కొంపలు బుగ్గియిపోతున్నాయంటే మూసేస్తాను. సంసారాలు కూలిపోతున్నాయంటే మానేస్తాను. కానీ ఆ పోతరాజు పెజల బాగోగులు చూసే పదవిలో వున్నాడు. అతగాడి షాపుల్లోని మందుతో సంసారాలు నిలబడిపోతున్నాయా? జనాలు సుకపడిపోతున్నారా? ఆడిని పబ్లీగ్గా నిజం వప్పుకోమనండి. ఆడీ యాపారం మానేస్తే నానెందులో పడిపోమన్నా పడిపోతాను'' ఈ మాటలు అంటూనే ఆమె బయటకు నడిచింది.

ఆమె మాటలకు అదిరిపడి అప్పలసామి సియ్యో వంక చూశాడు. సియ్యో ఇంకెటో చూస్తూవుండిపోయాడు. గదిలో సారా వాసనకు గదంతా పులుస్తున్నది. ''అంతా కంపే'' అనుకొన్నాడతడు.

★

## ఒంటరి అక్షయ్

**తం**డ్రి వినోద్‌ఖన్నా లాగా అక్షయ్‌ఖన్నా ఫాస్ట్‌గా వుండడు. మూడు దశాబ్దాల క్రితం వినోద్ ఒక్క వెలుగు వెలిగాడు. రజనీష్ పిచ్చిలో పడి కెరీర్‌ని వదులుకున్నాడు. తరువాత తెరపై నటించినా క్లిక్ కాలేదు. బిజెపిలో చేరి మంత్రిగా కూడా పనిచేశాడు. ఆయన కొడుకు అక్షయ్ కెరీర్‌గ్రాఫ్ స్లోగానే వుంది. తాళ్ సినిమా సూపర్ హిట్టయినా ఆ క్రెడిట్ ఐశ్వర్యకే దక్కింది. అక్షయ్ పెద్దగా కలుపుగోలు మనిషి కాదు. రిజర్వ్‌డ్. మీడియాకి చాలా దూరంగా వుంటాడు. దిల్ చాహతా హైలో అక్షయ్‌కి మంచి మార్కులే పడ్డాయి. హాస్యాన్ని ఇష్టపడే అక్షయ్, పార్టీలకి వెళ్ళినా ఒంటరిగానే వుంటాడు. గర్ల్‌ఫ్రెండ్స్ కూడా అతన్ని చూస్తే మొహం చిట్లించుకుని 'బుద్ధూ' అనుకుంటూ వెళ్ళిపోతారు.

